


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శుక్రవారం 26 జూలై 2024 | HYDERABAD




## జలమండలికి ఏ మూలకూ సరిపోవు

**అడిగింది 5580 కోట్లు**

**ఇచ్చింది 3385 కోట్లు**

**కరెంటు బకాయిలను పట్టించుకోని ప్రభుత్వం**

**సుంకిశాలకు, ఇతర ప్రాజెక్టులకు అరకొర కేటాయింపులే**

**అదనపు గోదావరి జలాలపై ఏ మాత్రం దృష్టి పెట్టని సర్కారు**

సిటీబ్యూరో, జూలై 25 (నమస్తే తెలంగాణ) : దాదాపు కోటిన్నర దాటిన హైదరాబాద్ నగర జనాభాకు అనుగుణంగా కొరత లేకుండా తాగునీటిని సరఫరా చేయాలంటే జలమండలికి అత్యంత ప్రాధాన్యతతో ఎలాంటి లోటు లేకుండా బడ్జెట్ కేటాయింపులు జరగాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో హైదరాబాద్ మహానగరాన్ని పూర్తిగా విస్మరించింది. ఇప్పటికే కొనసాగుతున్న ప్రాజెక్టులకు అరకొరగా కేటాయించి చేతులు దులుపుకున్నది. జలమండలి 5580 కోట్ల రూపాయలు అడిగితే కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 3385 కోట్లు మాత్రమే ఇచ్చింది. వేసవిలోనూ ఏ ఆటంకమూ లేకుండా నగరానికి నీరందించేందుకు నాగార్జున సాగర్ వద్ద నిర్మితమవుతున్న అత్యంత కీలకమైన సుంకిశాల ప్రాజెక్టుకు అరకొర నిధులే ప్రకటించింది. జలమండలికి భారంగా మారిన 4500 కోట్లకు పైగా విద్యుత్ బిల్లుల బకాయిలపై భరోసా కల్పించలేదు.ఈ విషయంలో సబ్సిడీ ఇవ్వాలని 400కోట్ల మేర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా కేటాయింపుల్లో మాత్రం చిల్లి గవ్వ కూడా విదల్చలేదు

### కేసీఆర్ హయాంలో యుద్ధ ప్రాతిపదికన.. ఇప్పుడు నత్తనడకన

నగరవాసులకు తాగునీటి విషయంలో ఏడాది పొడవునా పూర్తి భరోసా దక్కేలా గత కేసీఆర్ ప్రభుత్వం నాగార్జున సాగర్ సమీపంలో సుంకిశాల వద్ద రూ 2214 కోట్లతో ప్రాజెక్టును చేపట్టింది. సుంకిశాల పథకంలో భాగంగా ఎంతటి విపత్కర పరిస్థితుల్లోనైనా సాగర్‌లో నీటి మట్టం 510 అడుగుల దిగువకు (డెడ్‌స్టోరేజీ) పడిపోయినా అక్కడి నుంచి నీరు తీసుకునేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు. అయితే గత ప్రభుత్వంలో స్థల సేకరణ నుంచి పంప్‌హౌస్ నిర్మాణం వరకు యుద్ధప్రాతిపదికన సాగిన పనులు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగానే నత్తనడకన సాగుతున్నాయి. బిల్లులు చెల్లింపులో జాప్యం జరుగుతుండడంతో సదరు ఏజెన్సీ ఇప్పటి వరకు 65 శాతం మేర మాత్రమే పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం మూడవ టన్నెల్ పనులు, సుంకిశాల నుంచి కోదండపూర్‌లోని నీటి శుద్ధి కేంద్రాల వరకు 18 కిలోమీటర్ల మేర 3 వరుసలతో భారీ పైపులైన్ నిర్మాణం పనులు, ఎలక్ట్రికల్ పనులు జరుగుతున్నాయి. వాస్తవానికి ఈ ప్రాజెక్టు డిసెంబర్ నాటికల్లా వస్తుందని భావించారు. కానీ ప్రభుత్వం కేవలం రూ.1000 కోట్లు మాత్రమే కేటాయించడంతో ఈ ప్రాజెక్టు వచ్చే ఏడాదికి కూడా అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనబడడం లేదు. మరోవైపు ఇప్పటికే బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమై కొనసాగుతున్న ఎస్టీపీలు, సీవరేజీ, వాటర్‌సేఫ్టీ ప్లాన్‌లకు 2280 కోట్లు అడిగితే సర్కారు కేవలం 1450కోట్లు మాత్రమే కేటాయించింది. కాగా, నగరంలో అమలవుతున్న ఉచిత మంచినీటి పథకానికి 300 కోట్లు ఇచ్చింది.

### అదనపు గోదావరి జలాలు.. ఇక రానట్టేనా?

సంవత్సరం పొడవునా నగర ప్రజల మంచినీటి అవసరాలు తీర్చేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి హైదరాబాద్‌కు 30 టీఎంసీలు కేటాయించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జంట జలాశయాలకు గోదావరి జలాలను తరలించే ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు పలుమార్లు హామీలిచ్చింది. కానీ బడ్జెట్‌లో ఈ విషయంపై ఎలాంటి ప్రస్తావన లేకపోవడంతో నగరవాసులను విస్మయపరిచింది. అత్యంత కీలకమైన తాగునీటి విషయంలో ప్రభుత్వం ఇంత నిర్లిప్తంగా ఉండడంపై పెదవి విరుస్తున్నారు.

| బడ్జెట్ కేటాయింపులు | |
|---|---|
| రుణాల చెల్లింపు- | 635 కోట్లు |
| అభివృద్ధి పనులు - | 1450 కోట్లు |
| సుంకిశాల ప్రాజెక్టు- | 1000కోట్లు |
| ఉచిత తాగునీటికి - | 300 కోట్లు |
| మొత్తం | 3385 కోట్లు |



## అరకొరే ఇచ్చారు

**మెట్రో విస్తరణకు 24042 కోట్లు అవసరం**

**సర్కారు ప్రకటించింది 1100 కోట్లే**

**ఆస్తుల సేకరణకే ఆ నిధులు చాలవు**

**ఇంకా కావలసింది 22,942 కోట్లు**

సిటీబ్యూరో, జూలై 25 (నమస్తే తెలంగాణ): అంతన్నారు... ఇంతన్నారు... ఆఖరుకు అత్తెసరుతో సరిపెట్టారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ప్రతిపాదిత మెట్రో కారిడార్ల విస్తరణలో ఆస్తుల సేకరణకే సరిపోని పరిస్థితి. ఆర్భాటంగా ప్రచారాలు చేసి హడావుడిగా శంకుస్థాపనలు చేసి కొండంత రాగం తీసిన ప్రభుత్వం తీరా బడ్జెట్‌లో మాత్రం అరకొరగా ప్రకటించి చేతులు దులుపుకున్నది. ప్రభుత్వం విస్తరించాలనుకున్న 78.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో కారిడార్లకు గాను అవసరమైన వ్యయం 24,042 కోట్ల రూపాయలు. కానీ బడ్జెట్‌లో మాత్రం కేవలం 1100 కోట్లు కేటాయించారు.

### వ్యయానికి కేటాయింపులకు పొంతనేదీ?

గత కేసీఆర్ ప్రభుత్వం 2023 బడ్జెట్‌లో మెట్రో విస్తరణకు రూ.2500 కోట్లను కేటాయించి రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు పనులు మొదలు పెట్టింది. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ ప్రాజెక్టును పూర్తిగా రద్దు చేసింది. మెట్రో రెండో దశ ప్రతిపాదనలను సమీక్షించి వాటిని సవరించి కొత్త ప్రతిపాదనలను రూపొందించింది. ఇందులో భాగంగా 78.4 కిలోమీటర్ల పొడవైన కొత్త మెట్రో కారిడార్‌ను 24,042 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయిచింది. మెట్రో రైలును పాత నగరానికి 5.5 కిలోమీటర్ల మేర పొడిగించి దాన్ని శంషాబాద్ విమానాశ్రయానికి అనుసంధానం చేయాలని ప్రణాళిక రచించారు. ఎల్బీనగర్ నుండి నాగోలుకు 7 కిలోమీటర్ల మేర కారిడార్‌ను విస్తరించాలని, నాగోలు, ఎల్బీనగర్, చంద్రాయణగుట్ట స్టేషన్లను ఇంటర్ చేంజ్ స్టేషన్లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. మియాపూర్ నుండి పటాన్ చెరువుకు 14 కిలోమీటర్ల మేర మెట్రో రైలు సౌకర్యాన్ని పొడిగించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. కానీ ఒక్క పాతనగరంలోనే దాదాపు 1100 ఆస్తులను సేకరించాల్సి ఉంది. వీటికే దాదాపుగా 2వేల కోట్లు అవసరమవుతాయని అంచనా. 24వేల కోట్లకు పైగా వ్యయమయ్యే మెట్రో పనుల విస్తరణపై ఆర్భాటంగా ప్రకటనలు చేసి కేవలం 5 శాతం మాత్రమే నిధులు సమకూరిస్తే పనులు ముందుకు సాగేది ఎలా అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

| బడ్జెట్‌లో కేటాయింపులు (కోట్లలో) | |
|---|---|
| హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్‌కు | 500 |
| పాత నగరం మెట్రో కోసం | 500 |
| ఎయిర్‌పోర్టు మెట్రో కోసం | 100 |
| **మెట్రో విస్తరణకు** | |
| అంచనా వ్యయం | 24,042 |
| బడ్జెట్‌లో ప్రకటించింది | 1100 |
| ఇంకా అవసరమయ్యే నిధులు | 22,942 |

## బడ్జెట్-2024-25



# అత్తెసరుతో సరిపెట్టారు

## మాటల్లోనే రీజియన్.. చేతల్లో ఏదీ విజన్?!

**ఔటర్ సరిహద్దుగా మహా నగర అభివృద్ధి అంటూ ప్రకటనలు**

**బడ్జెట్‌లో మాత్రం గ్రేటర్ దాటని కేటాయింపులు**

**రూ.1100 కోట్ల అరకొర కేటాయింపుతో ఈ ఏడాదీ పట్టాలెక్కని మెట్రో విస్తరణ**

**లక్షన్నర కోట్ల మూసీ సుందరీకరణకు రూ.1500 కోట్లు**

**సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణానికీ అరకొర కేటాయింపులే**

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూలై 25 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణను మూడు భాగాలుగా విభజించి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. అవుటర్ రింగు రోడ్డు వరకు తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్)... అవుటర్ నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు సెమీ అర్బన్.. ఆపై గ్రామీణం' ఇదీ.. ఢిల్లీ నుంచి గల్లీ దాకా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ప్రభుత్వ పెద్దలు తెలంగాణ ప్రజలకు చూపుతున్న గ్రాఫిక్ చిత్రం. మరి బడ్జెట్ కేటాయింపుల్లో ప్రభుత్వ విజన్ ప్రతిఫలించాలి కదా! కానీ గురువారం శాసనసభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అవన్నీ మాటలకే పరిమితం అని తేలిపోయింది. అంతేకాదు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రా విభాగం కూడా కర్రపెత్తనానికే తప్ప అభివృద్ధి ప్రణాళిక అమలుకు ప్రాతిపదిక కాదనే వాస్తవమూ తేటతెల్లమైంది. గతంలో మాదిరిగా ఆయా శాఖల పరిధిలో కొనసాగుతున్న ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు జరిపారే తప్ప కాంగ్రెస్ సర్కారు విజన్‌గా చెప్పుకునే మహా నగర విస్తరణ (పరిధి పెంపు)కు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన పెంపునకు చిల్లిగవ్వ కేటాయింపు లేదంటే టీసీయూఆర్ అనేది కేవలం కాగితాలకే పరిమితంగా స్పష్టమవుతుంది. మరోవైపు హైదరాబాద్ అభివృద్ధికి రూ.10వేల కోట్లు అంటూ భట్టి విక్రమార్క ఘనంగా చెప్పుకున్నా.. కొన్ని శాఖల కేటాయింపులతో ప్రాజెక్టులు అటు ముందుకు.. ఇటు వెనక్కి వెళ్లలేక సందిగ్ధంలో పడిపోనున్నాయని ఆయా శాఖల అధికారులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఇదీ... చేదు అనుభవం!

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా విస్తరిస్తూ 2007లో అధికారికంగా నిర్ణయం తీసుకుంది. నగరం చుట్టూ ఉన్న 12 మున్సిపాలిటీలతో పాటు 8 గ్రామపంచాయతీలను విలీనం చేస్తూ ఎంసీహెచ్‌ను జీహెచ్‌ఎంసీగా మారుస్తూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఈ విస్తరణ కేవలం కాగితాలకే పరిమితమైంది. పేరుకు గ్రేటర్ హైదరాబాద్ అయినా శివారు ప్రాంతాలు మంచినీరు, మురుగునీటి పారుదల, రోడ్లు.. ఇలా కనీస సౌకర్యాలు లేకుండా కునారిల్లిపోయాయి. 2007 మొదలు 2014 వరకు శివారు ప్రాంతాల మౌలిక వసతుల కల్పనను పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నీటి సరఫరా మెరుగుపడి... 15 రోజులకోసారి నల్లా నీళ్లకు నోచుకునే కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి వంటి ప్రాంతాలకు రోజు విడిచి రోజు నీటి సరఫరా మొదలైంది. ఇదొక్కటే కాదు... ఫ్లైఓవర్లు, స్కైవేలతో అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు వచ్చాయి. అందుకే ఇప్పుడు ప్రధాన నగరం కంటే చుట్టూ ఉన్న ప్రాంతాలే అన్నిరంగాల్లో అత్యధికంగా అభివృద్ధి చెందాయి.

### 1100 కోట్లతో మెట్రో విస్తరణ జరిగేనా?

శాసనసభలో గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మెట్రో రైలు ప్రాజెక్టు విస్తరణకు కేటాయించింది రూ.1100 కోట్లు అయినా... ఈ ఆర్థిక సంవత్సరం ప్రాజెక్టు పనులు పట్టాలెక్కే సూచనలు లేవనేది సుస్పష్టం. పాతబస్తీ మెట్రోకు రూ.500 కోట్లు కేటాయించగా... రూ.2వేల కోట్ల అంచనా వ్యయంలో భూసేకరణకు రూ.800 కోట్లు అవసరమవుతుందని అంచనా. దీంతో అటు భూసేకరణ పూర్తయ్యేలా లేకపోగా... కీలకమైన పీపీపీ విధానం మరో అడ్డంకిగా మారింది. దీంతో ఈ చిక్కుముళ్లు వీడేందుకు ఎంత సమయం పడుతుందో అధికారులకూ అంతుబట్టడంలేదు. కిలోమీటరుకు రూ.250 కోట్ల వరకు వ్యయం అయ్యే 29 కిలోమీటర్ల ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టుకు కేవలం రూ.100 కోట్లు కేటాయించారు. ఇవి సర్వేలకూ సరిపోని పరిస్థితి. ఇలా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3-5వేల కోట్ల వరకు కేటాయింపులు ఉంటే తప్ప ముందుకు కదలని మెట్రో రైలుకు కేవలం రూ.1100 కోట్లు కేటాయించడంతో హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్) ఏమీచేయలేని అయోమయ పరిస్థితి. ఇక... లక్షన్నర కోట్ల రూపాయల మూసీకి ఈ బడ్జెట్‌లో రూ.1500 కోట్లు కేటాయించారు. అంటే అప్పులే తమకు గిట్టవు అన్నట్లుగా ప్రకటనలు చేసే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున రుణాలు తీసుకోనుందనేది దీని ద్వారా బట్టబయలైంది. జలమండలికి ప్రస్తుతం పురోగతిలో ఉన్న ప్రాజెక్టులకే నిధులు కేటాయించారుగానీ గ్రేటర్ సరిహద్దు దాటి మౌలిక వసతుల కల్పనకు కించిత్తు అవకాశం కల్పించలేదు. హెచ్‌ఎండీఏకు పేరుకు రూ.500 కోట్ల అభివృద్ధి నిధులు అన్నారేగానీ ఏ ప్రాజెక్టుకు అనే దానిపై స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో హెచ్‌ఎండీఏ చేతిలోని కీలకమైన ఎలివేటెడ్ కారిడార్లకు సుమారు రూ.3800 కోట్ల వరకు వ్యయం అవుతున్నందున ఆ నిధులూ ఎటూ సరిపోని పరిస్థితి. మరోవైపు అత్యంత కీలకమైన సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం శీతకన్ను ప్రదర్శించింది. వరంగల్‌లోని సూపర్ స్పెషాలిటీ సహా నగరంలో గడ్డి అన్నారం, అల్వాల్, ఎర్రగడ్డ ఆస్పత్రుల నిర్మాణానికి కేవలం రూ.260 కోట్లు మాత్రమే కేటాయించడం గమనార్హం.

### విస్తరణ..కాగితాలపైనేనా

గత ఏడాది డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ మహా నగర విస్తరణపై కొత్త పల్లవి అందుకున్నది. ఔటర్ రింగు రోడ్డు వరకు కోర్ ఏరియా అంటూ సీఎం రేవంత్‌రెడ్డి మొదలుపెట్టిన ఈ రాగం హైడ్రాతో ఒకడుగు ముందుకేసింది. ఈ నేపథ్యంలో తాజా బడ్జెట్‌లో హైదరాబాద్ మహా నగర అభివృద్ధికి నిధుల కేటాయింపు కూడా ఇదే తరహాలో ఉంటుందనే ఆసక్తి నెలకొన్నది. కానీ గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మాత్రం నిధుల కేటాయింపు తీరు గ్రేటర్ హైదరాబాద్ ప్రాతిపదికనే జరిగింది. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ, జలమండలి, హెచ్‌ఎండీఏ విభాగాల కేటాయింపుల్లో ఇప్పటికే పురోగతి ఉన్న ప్రాజెక్టులకు మాత్రమే కేటాయించారు. కానీ గ్రేటర్‌ను దాటి ఉన్న ప్రాంతాలకు మౌలిక వసతుల విస్తరణ కోసం ఎలాంటి అవకాశం కల్పించలేదు. అందునా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగంలోనూ హైడ్రా (హైదరాబాద్ విపత్తు నివారణ, ఆస్తుల పరిరక్షణ సంస్థ)ను ప్రస్తావిస్తూ విపత్తులు వచ్చినపుడు ఆదుకునేందుకు దీనిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కానీ వాస్తవంగా గ్రేటర్‌ను దాటిన ప్రాంతాల్లో విపత్తు నిర్వహణ అనేది సమస్యగా ఏమీ లేదు. అక్కడ కావాల్సింది... గ్రేటర్‌కు సమానంగా మౌలిక వసతుల కల్పన. అయినా ఈ అంశాన్ని అటు ప్రసంగంలోనూ ఇటు కేటాయింపుల్లోనూ రేవంత్ సర్కారు విస్మరించింది. గ్రేటర్‌ను దాటి టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు అనుగుణంగా ఈ బడ్జెట్‌లో కించిత్తు అడుగుపడలేదు. దీంతో గతంలో మాదిరిగానే అవుటర్‌దాకా మహా నగర విస్తరణ అనేది కేవలం కాగితాలకే పరిమితం అవుతుందా? అనే ఆందోళన వ్యక్తమవుతుంది.



## లక్షన్నర కోట్లని చెప్పి 1500 కోట్లు ఇచ్చారు

**మూసీ ప్రక్షాళనపై ఆర్భాటంగా ప్రకటనలు**

**కేటాయింపుల్లో లేని ప్రాధాన్యత**

**వ్యయంలో 1 శాతమే కేటాయింపు**

**భూసేకరణకే సరిపోని నిధులు**

సిటీబ్యూరో, జులై 25 (నమస్తే తెలంగాణ) : ''మూడేళ్లలో మూసీని థేమ్స్ తరహాలో డెవలప్ చేస్తాం. ఇప్పటికే డీపీఆర్ కూడా సిద్ధమైంది. వచ్చే ఐదేళ్లలో 1.5 లక్షల కోట్లు ఖర్చు చేసి మూసీతో హైదరాబాద్‌కు వన్నెతీసుకువస్తాం. విశ్వనగరానికి ప్రతీకగా, ప్రపంచ స్థాయిలో మూసీని తీర్చిదిద్దుతాం'' అంటూ మూసీ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలన్నీ మూసీలో నురగలాంటిదేనని తేలిపోయింది. ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టుగా చెప్పుకుంటూ ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ బీరాలు పోయింది. ఖర్చు చేసుడు దేవుడెరుగు కనీసం మూసీ కేటాయింపుల్లోనే అత్తెసరు నిధులతో లెక్కలు చూపించింది. ఇక లెక్కలు తేలి, పనులు మొదలుపెట్టాలంటే బారెడు ఖర్చుతో కూడుకున్న మూసీ సుందరీకరణ మూరెడు నిధులతో ఎలా సాధ్యం అవుతుందనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. కేటాయించిన రూ. 1500 కోట్లు 56కిలోమీటర్ల విస్తరించి ఉన్న భూసేకరణకు కూడా సరిపోయేలా లేవని అధికార వర్గాల్లో చర్చ నడుస్తున్నది.

### ఫ్లాగ్‌షిప్‌కు ఒక్క శాతం నిధులు..

మూసీ ప్రక్షాళన కోసం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ అధికారులు నదికి ఇరువైపులా ఉన్న సామాజిక ఆర్థిక సర్వే నిర్వహించింది. దాదాపు 55 కిలోమీటర్ల మేర 12వేలకు పైగా ఆక్రమ నిర్మాణాలను గుర్తించింది. ఇందులో ప్రభుత్వ, వక్ఫ్, దేవాదాయ శాఖ ఆస్తులతోపాటుగా పట్టా భూములు కూడా ఉన్నాయి. వీటన్నింటిని తొలగించి మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలంటే భూసేకరణకు భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఓ అంచనా ప్రకారం ఇప్పటివరకు లెక్కతేల్చిన మొత్తం నిర్మాణాల్లో 60 శాతం నిర్మాణాలకు పరిహారాన్ని చెల్లించాలంటే వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. ఇక డీపీఆర్, ప్రాజెక్టు నిర్మాణం, మౌలిక వసతుల పేరిట భారీ మొత్తంలోనే ఖర్చు చేయాల్సి ఉంటుంది. మూసీపై ఉన్న వంతెనల నిర్మాణం, ఆధునీకరణ, ఎస్‌టీపీల నిర్మాణం, మురుగు నీటిని తరలింపు వంటి అంశాలకు భారీ వేలలో ఖర్చు చేయాల్సి ఉంటుందనే అంచనాలు ఉన్నాయి. కానీ ప్రభుత్వం కేటాయించిన రూ. 1500 కోట్లు మూసీ అభివృద్ధిలో దేనికోసం ఖర్చు చేయాలనే విషయంలో ఇప్పటికీ అధికారులు స్పష్టత లేకుండా పోయింది. మూసీ మురుగును తొలగించడమే తన లక్ష్యమని, తనకు ఈ ప్రాజెక్టు ఎంతో ప్రతిష్ఠాత్మకమని చెప్పుకుంటూ, ప్రాజెక్టు వ్యయాన్ని మూడు నెల్లో లక్షన్నర కోట్లకు సీఎం రేవంత్ రెడ్డి పెంచేశారు. ఆ స్థాయి ప్రాజెక్టుకు మొత్తం అంచనా వ్యయంలో ఒక్కశాతం నిధులను కేటాయించడం, ప్రాజెక్టును ఆచరణలో పెట్టడం ఎలా సాధ్యం అవుతుందనే విమర్శలు వస్తున్నాయి. కనీసం మూసీ సుందరీకరణ కోసం ఇప్పటివరకు ఆహ్వానించిన టెండర్లను అమలు చేయాలంటేనే కనీసం 400-500 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందనే చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం కేటాయించిన నిధులతో మూసీ ఎలా మురిపిస్తారంటూ నగరవాసులు చర్చించుకుంటున్నారు.

### శుష్క ప్రియాలు.. శూన్య హస్తాలు

**6వేల కోట్లు అడిగితే 3వేల కోట్లు ఇచ్చారు**

సిటీబ్యూరో, జూలై 25 (నమస్తే తెలంగాణ) : తెలంగాణకు ఐకాన్‌గా మారిన హైదరాబాద్ నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని బడ్జెట్ ప్రసంగంలో గొప్పగా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం తీరా కేటాయింపులకు వచ్చేసరికి మాత్రం చతికిలబడిపోయింది. శరవేగంగా మారుతున్న నగర పురోభివృద్ధికి బల్దియా 6వేల కోట్ల రూపాయలు అవసరమని అడిగితే 3వేల కోట్లు మాత్రమే ప్రకటించింది.

### హెచ్-సిటీకి నిధులపై స్పష్టతేదీ?

హైదరాబాద్ సమగ్ర అభివృద్ధి పేరిట కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, సీఆర్‌ఎంపీ పథకాల స్థానంలో కాంగ్రెస్ సర్కారు హెచ్ సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్, ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)కి రూపకల్పన చేసింది. కానీ ఆచరణలో మాత్రం అందుకు తగ్గట్లుగా నిధుల కేటాయింపులు జరపలేదు. కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్ రవాణా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చి శరవేగంతో 36 ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టులను చేపట్టి చాలా ప్రాంతాల్లో సిగ్నల్ ఫ్రీ సిటీగా మార్చేసింది. ఏటా రూ.600-700కోట్ల మేర నిధులను ఖర్చు చేసి ఫ్లై ఓవర్లు, ఆర్వోబీ, ఆర్‌యూబీలను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో పాటు వరద నీటికి శాశ్వత పరిష్కారంగా ఎస్ఎన్‌డీపీ పథకాన్ని తీసుకువచ్చి రూ. 985.45కోట్లతో చేపట్టిన మొదటి విడత పనులు రూ.592.68కోట్లు ఖర్చు పెట్టి 39 చోట్ల పనులను బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పూర్తి చేసింది. గుంతలు లేని రహదారులే లక్ష్యంగా సీఆర్‌ఎంపీ పథకాన్ని రూ. 900కోట్లతో చేపట్టి ఆదర్శవంతమైన పథకంగా మార్చింది. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి ఈ పథకాల స్థానంలో హెచ్ సిటీ ప్రాజెక్టుగా ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చారు. ఇంత వరకు బాగానే ఉన్న రవాణా వ్యవస్థ, మౌలిక వసతుల కల్పనకుగానూ హెచ్ సిటీ కింద కేవలం రూ.2675.35 కోట్లు మాత్రమే కేటాయించింది. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీకి రూ.7వేల కోట్లకు పైగా అప్పులు ఉన్నాయి.. ఈ అప్పులకు సర్కారు ఎలాంటి భరోసా ఇవ్వలేదు. మొత్తంగా సర్కారుకు రూ. 6వేల కోట్ల ప్రతిపాదనలు పంపిస్తే ..ప్రభుత్వం మాత్రం 3,075.7 కోట్లు మాత్రమే కేటాయించింది.



### ఎలివేటెడ్ కారిడార్లు ఉన్నట్టా.. లేనట్టా?

**ప్యారడైజ్-దుండిగల్.. ప్యాట్నీ- తూంకుంట**

**ఫ్లైఓవర్లను ప్రస్తావించని సర్కారు**

సిటీబ్యూరో, జులై 25 (నమస్తే తెలంగాణ) : ప్యారడైజ్ నుంచి దుండిగల్ వరకు, ప్యాట్నీ నుంచి తూంకుంట వరకు రెండు భారీ ఎలివేటెడ్ కారిడార్లను నిర్మాణం చేస్తామని ప్రకటించి శంకుస్థాపన చేసిన ప్రభుత్వం బడ్జెట్‌లో మాత్రం నామమాత్రపు నిధులిచ్చి వాటి భవితవ్యాన్ని సందిగ్ధంలో పడేసింది. ఈ రెండు కారిడార్ల నిర్మాణానికి అవుతున్న వ్యయం 3800 కోట్లు. కాగా ప్రభుత్వం సరిగ్గా పార్లమెంటు ఎన్నికల ముందు హడావుడిగా అల్వాల్ టిమ్స్ వద్ద భారీ సభను ఏర్పాటు చేసి శంకుస్థాపన చేశారు. కానీ బడ్జెట్‌లో మాత్రం వాటి ప్రస్తావన లేకుండా చేశారు.

### ఇచ్చిన 700 కోట్లలో...

హైదరాబాద్ పరిధిని విస్తరిస్తామంటూ నగరంలో ఆధునాతన సదుపాయాలు, మౌలిక వసతుల నిర్వహణ విభాగమైన హెచ్‌ఎండీఏ ఈ ఏడాదికి గాను 1600 కోట్లు కావాలంటూ బడ్జెట్ ప్రతిపాదనలు పంపింది. కానీ ప్రభుత్వం 700 కోట్లే కేటాయించింది. ఇందులో 200 కోట్లు ఔటర్ రింగు రోడ్డు రుణాల చెల్లింపుకే సరిపోనున్నాయి. ఇక మిగిలిన 500 కోట్లను వేటికి ఖర్చు చేయాలో స్పష్టత లేదు. హైదరాబాద్‌ను విశ్వనగరంలో తీర్చిదిద్దే క్రమంలో లింక్ రోడ్లు, స్లిప్ రోడ్లతోపాటుగా హైదరాబాద్ అభివృద్ధికి అవసరమైన ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టులను హెచ్‌ఎండీఏ చేపట్టింది. ఈ క్రమంలో ప్యారడైజ్, ప్యాట్నీల వద్ద 2 భారీ ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించతలపెట్టింది. వీటికి 3800 కోట్లు కానుంది. శంకుస్థాపన చేశారు కానీ ఇప్పటికీ పరిహారం రక్షణ శాఖకు కేటాయించాల్సిన భూముల ఎంపిక కూడా పూర్తి కాలేదు. భూ బదలాయింపులు జరిగితే గానీ, ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులు ఇచ్చే పరిస్థితులు ఉంటాయి. అదే గనుక జరిగితే... భూ బదలాయింపులతో జరిగే జాప్యం ఆ 2 ప్రాజెక్టులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది.